ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యం

ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులు బొల్లం శ్రీను, గుబ్బల భార్గవి, పెంటకోట రాంబాబులకు రూ.3.60 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించారని, తిరిగి నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్య భద్రతపై అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు .అలాగే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్న వ్యాధులకు సంబంధించి కార్పొరేట్ ఆసుపత్రులలో పూర్తి వివరాలు తెలుసుకోవాలని, లేదంటే ఒక్కొక్క కార్పొరేట్ ఆసుపత్రి యాజమాన్యం ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా వైద్య సేవలు అందించాల్సి ఉన్నప్పటికీ, ఆ సేవలు ఆరోగ్యశ్రీ పథకంలో లేవని డబ్బులు కడితేనే వైద్యం చేస్తామని కూడా మోసం చేసే ఆసుపత్రిలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ విషయంలో ప్రజలు వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కలిగిన కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లినప్పుడు అక్కడున్న ఆరోగ్య మిత్రలను కలుసుకుని ఆరోగ్య శ్రీ పథకంలో ఏ ఏ వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయో తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు తోట భోగయ్య, కొణితివాడ గ్రామ ఉప సర్పంచ్ నాగరాజు శ్రీనివాసరాజు, కొట్టి కుటుంబ రావు, బుంగ ప్రహ్లాదుడు, సమతం ఉమా తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



పంచారామ క్షేత్ర ఆలయ ధర్మకర్తలు, అధికారులతో మాట్లాడుతున్న గ్రంధి

నిత్యాన్నదానానికి 100 క్వింటాళ్ల బియ్యం

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గునుపుడి పంచారామ క్షేత్రంలోని అన్నపూర్ణమ్మ అమ్మవారికి బియ్యం మొక్కుబడి చెల్లించనున్నారు. దీనికి సంబంధించి ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి, ఆలయ అధికారులు, అన్నదాన కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. 2004 నుంచి 2009 వరకు మొదటిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన నేటి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనకు ప్రభుత్వం ద్వారా వచ్చే పెన్షన్ సొమ్ముకు తోడుగా ఆయన సొంతంగా మరో రూ.లక్ష వేసుకుని అన్నపూర్ణమ్మ దేవికి బియ్యం రూపంలో మొక్కుబడి చెల్లించుకుంటున్నారు. అయితే కరోనా సమయంలో గునుపూడి సోమేశ్వర స్వామి ఆలయంలో నిత్యం జరిగే అన్నదానం కార్యక్రమం నిలిపేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చేనెల 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కార్తీమాసం సందర్భంగా కార్తీక మాసం నెల అంతా కూడా భక్తులకు నిత్య అన్నదానం చేయాలని, దీనికి సంబంధించి ముందుగా 100 క్వింటాళ్ల బియ్యాన్ని ఇస్తున్నామని ఆయన వారికి తెలిపారు. అంతేకాకుండా ఇంకా అవసరమైతే ఎంత బియ్యాన్ని అయినా కూడా తాను ఇస్తానని తెలిపారు. అంతేకాకుండా స్వామివారి మహా నివేదనకు కూడా ఆయన బియ్యం ఇస్తున్నారు. సమావేశంలో ఆలయ ఈఓ డి.రామకృష్ణం రాజు, పాలకవర్గ సభ్యులు నాచు శ్రీవల్లి, చెల్లబోయిన సూర్య ప్రకాష్, కూర్మాదాసు సత్య శ్రీనివాస్, నల్లం రఘు, కోయ తాతాజీ, లక్కు త్రిమూర్తులు, లీలా ఈశ్వర్, దాడి ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయరంగ సమస్యలపై సదస్సు

సాక్షి, భీమవరం: వ్యవసాయ, ఆక్వారంగ సమస్యలపై సోమవారం మధ్యాహ్నం 2 గం'కు భీమవరంలో టౌన్ రైల్వే స్టేషన్ వద్ద గల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు.ప్రముఖ రాష్ట్ర రైతు నాయకులు వై.కేశవరావు, సీపీఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు మంతెన సీతారాం,ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త యస్ .వేణుగోపాలరావు ముఖ్య వక్తలుగ పాల్గొంటారని తెలిపారు. వరి, ఆక్వా (రొయ్యలు, చేపలు), కొబ్బరి, కూరగాయలు, పండ్లతోటలు, తమలపాకు, ఉప్పు, సరుగుడు, ఆయిల్ పామ్, చెరకు, కోకో తదితర పంటల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చిస్తామని బలరాం తెలిపారు. సదస్సులో అన్ని పంటల రైతులు పాల్గొనాలని బలరాం విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయ నిధి పేద రోగులకు ఆసరా

కాళ్ల: సీఎం సహాయ నిధి పేద రోగులకు ఆసరాగా నిలుస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మండలంలోని పెద అమిరం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం నందు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఉండి నియోజకవర్గంలో దొడ్డనపూడి, కాళ్ళకూరు, ఎస్ఆర్పీ అగ్రహారం, సిద్ధాపురం గ్రామాలకు చెందిన రోగులకు రూ.5.40 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు ఆర్థిక ఇబ్బందుల వల్ల అనారోగ్యం బారిన పడకూడదనే లక్ష్యంతో ఆదుకుంటున్నారన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని పేద రోగులకు సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటూ ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడుతున్నారన్నారు. అన్నివిధాలుగా ప్రజలను ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసుకుంటే మరిన్ని సేవలు చేస్తారని అన్నారు. ముఖ్యమంత్రికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, ధనుంజయ్, గుండా సాయి, వేగేశ్న విజయరామరాజు, నారాయణరాజు, చిగురుపాటి చిట్టిబాబు, చెన్నంశెట్టి దేవి ప్రసాద్, తారకం, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న పీవీఎల్ నర్సింహరాజు

కులాల వారీగా జనగణన చేపట్టాలి

బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు

పాలకోడేరు: కేంద్ర ప్రభుత్వం వెంటనే కులాల వారీగా జనగణన చేపట్టాలని బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. సంఘ సమావేశాన్ని గొల్లలకోడేరులో మండలాధ్యక్షుడు దొమ్మేటి వేణుగోపాల్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోందని విమర్శించారు. బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. స్థానిక సంస్థల్లో కచ్చితంగా 34 శాతం రిజర్వేషన్ కొనసాగించాలన్నారు. దేశంలో అనేక కులాలు రిజర్వేషన్ లేకపోతే ఆర్థికంగా ముందుకు సాగలేవని ఉద్దేశంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారన్నారు. దేశంలో ఎన్నో కులాలు ఉంటే కేవలం 10 కులాలు మాత్రమే అసెంబ్లీ, పార్లమెంట్ గడపలు తొక్కుతున్నాయని అన్నారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్ ప్రకటించడం ద్వారా బీసీలను ముంచినట్లేనని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో అసలు రిజర్వేషన్‌కి అర్థం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిప్పాడా చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కుక్కల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కండిబోయిన సుబ్రమణ్యం, మండల ఉపాధ్యక్షుడు నేతల గోపి, గౌరవాధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గూడూరి వెంకటేశ్వరరావు

క్రీడలతో మానసిక ఉల్లాసం

సాక్షి, భీమవరం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయని, ఆటలకు వయస్సుతో పనిలేదని ఉయ్యూరు ఆర్డీవో దాసి రాజు అన్నారు. భీమవరం లూథరన్ హైస్కూల్లో ఏపీ బహుజన జేఏసీ 3వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలను ఆర్డీవో ప్రారంభించి మాట్లాడారు. వార్షికోత్సవం సందర్భంగా జేఏసీ సభ్యులు ఐకమత్యంతో వివిధ రకాల క్రీడలను ఏర్పాటు చేసుకుని ఉల్లాసంగా ఉత్సాహంగా గడపడం ఆనందించదగిన విషయమన్నారు. గౌరవాధ్యక్షుడు కాటం స్టాన్లీ రాజు, జెఏసి అధ్యక్షులు కొనా జోసఫ్, తాళ్లూరి మధు మాట్లాడుతూ పురుషులకు క్రికెట్, కబడ్డీ, కోకో, మహిళలకు మ్యూజిక్ చైర్స్ పోటీలను నిర్వహించామని గెలుపొందిన వారికి బహుమతులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఈది రవికుమార్, కోనా రంజిత్, బిరుదుగడ్డ రమేష్ బాబు, మాజీ కౌన్సిలర్ పాలవెల్లి మంగ తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీను ప్రారంభిస్తున్న ఉయ్యూరు ఆర్డీవో దాసి రాజు

ఆక్వా సదస్సుకు పీవీఎల్‌కి ఆహ్వానం

కాళ్ల: వచ్చేనెల 2వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కాళ్ల మండలం పెద అమిరంలో ఆక్వా ఎక్స్‌పో ఇండియా ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆక్వా ఎక్స్‌పో సీఈవో దంతులూరి వేణు ఆదివారం తెలిపారు. నవంబర్ 2, 3, 4 తేదీల్లో పెద అమిరం రోడ్డులోని రాధాకృష్ణ కన్వెన్షన్ సెంటర్‌లో ఆక్వా ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును పెద అమిరం పార్టీ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఎక్స్‌పోలో 100 స్టాళ్లకు పైగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాళ్ళ, పాలకోడేరు ఎంపీపీలు పెనుమత్స విశ్వనాథరాజు, భూపతి రాజు చంటిరాజు, కుముదవల్లి సర్పంచ్ వంశీకృష్ణంరాజు, సాగిరాజు హరి వర్మ, కలిదిండి బుజ్జి, పెనుమత్స శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



పీవీఎల్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సీఈఓ వేణు

8న పాలకొల్లులో సామాజిక సాధికార యాత్ర

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో నవంబర్ 8న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను ప్రతి కార్యకర్త తమ భుజస్కందాలపై వేసుకుని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పిలుపు నిచ్చారు. బస్సుయాత్ర కార్యాచరణపై ఆదివారం పట్టణంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ భవన్‌లో వార్డు ఇన్‌చార్జ్‌లు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. పాలకొల్లులో నిర్వహించే బస్సుయాత్రపై అధిష్టానం ఎంతో నమ్మకం పెట్టుకుంటుందన్నారు. ఈ బస్సుయాత్రకు నియోజకవర్గంలోని పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలం, పోడూరు, యలమంచిలి మండలాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కోరారు. బస్సుయాత్రలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మంత్రులు పాల్గొంటారన్నారు. బస్సుయాత్ర పూలపల్లి మలుపు వద్ద నుంచి 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి గాంధీబొమ్మల సెంటర్‌లో సాయంత్రం 5 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రతీ వార్డు నుంచి కనీసం 500 మంది గాంధీ బొమ్మల సెంటర్‌కు చేరుకునేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. సమావేశంలో చింతలపూడి, దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, మామిడి వెంకటేశ్వరరావు (బాబు), పార్టీ నాయకులు అడబాల వెంకటరమణ, మద్దా చంద్రకళ, కొర్రగింజల శ్రీనివాసరావు, బండి రమేష్, చినిమిల్లి గణపతిరావు, జోగాడ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

రైలు కిందపడి వ్యక్తి దుర్మరణం

తాడేపల్లిగూడెం: స్థానిక రైల్వే స్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫామ్‌లో రాజమండ్రి వైపు వెళ్తున్న రైలు కిందపడి ఓ వ్యక్తి దుర్మరణం చెందినట్లు తాడేపల్లిగూడెం రైల్వే పోలీసులు తెలిపారు. ఆదివారం సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి గూడ్సు రైలు కిందపడి మరణించాడు. పింక్ కలర్ షర్టు, సిమెంటు కలర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. ఈ వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో గుర్తింపు కోసం మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చారు. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలిస్తే 94906 17090 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

వైఎస్సార్ సీపీ వెంటే అట్టడుగు వర్గాలు

నరసాపురం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర బడుగు వర్గాల వారు వైఎస్సార్ సీపీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం నరసాపురం శాఖ అధ్యక్షుడు తిర్రే బాబూరావు అన్నారు. నరసాపురంలో జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రకు అపూర్వ స్పందన రావడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితులు, బీసీలతో సహా అన్ని వర్గాల వారు సీఎం జగన్ సాగిస్తున్న ప్రజారంజక పాలనకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి గతంలో వచ్చిన 23 సీట్లు కూడా రావని పేర్కొన్నారు.

పాలకొల్లు చిత్రకారులకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

పాలకొల్లు అర్బన్: ఒంగోలు ఆర్ట్ ఫెస్టివల్–2023 మెగా పోట్రేట్ ఈవెంట్ వరల్డ్ రికార్డు, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో పలువురు పాలకొల్లు చిత్రకారుల పేర్లు నమోదైనట్లు ప్రముఖ చిత్రకారుడు కొసనా భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనతో పాటు చిత్రకారులు కడలి శ్రీనివాస్, చెల్లబోయిన రాము, నక్కా వెంకట్, బుడితి రామారావులు ఈ లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో పేరు నమోదైనట్లు తెలిపారు. చిత్రకళలో విశేష సేవలందించిన డి.రామకృష్ణ (రాఖీ) స్థాపించిన వపా బాపు ఆర్ట్ అకాడమీ– పాలకొల్లుకు ఆర్ట్ గెలాక్సీను అందజేసి సత్కరించినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తణుకు: తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధి స్థానిక బస్టాండ్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పాత రైల్వే గేటు సమీపంలో సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆకు పచ్చరంగు, తెలుగు చారలు కలిగిన చొక్కా, నీలంరంగు జీన్స్ ఫ్యాంటు ధరించిన వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు తణుకు రూరల్ పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

మేడపాడులో ఊరేగింపు సందడి

యలమంచిలి: దసర శరన్నవరాత్రులలో భాగంగా మేడపాడు గ్రామంలోని కాలనీలో ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఆదివారం జాతరను తలపిస్తూ ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి విగ్రహాన్ని రెండు భారీ ఎడ్ల బొమ్మలున్న వాహనం మీదకు ఎక్కించారు. ఈ వాహనానికి వెనుక వైపు ఆవు దూడ బొమ్మలు ఏర్పాటు చేశారు. వీటితోపాటు విచిత్ర వేషధారణలు, డీజే, తీన్‌మార్ డప్పులు ఏర్పాటు చేసి గ్రామమంతా ఊరేగించారు. ఎడ్లు, ఆవు దూడ బొమ్మలతో కూడి వాహనం ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నవంబర్ 1న భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని ఎడ్ల బండిపై ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

కొప్పర్రులో అన్నసమారాధన

నరసాపురం రూరల్: దసరా శరన్నవరాత్రుల ముగింపు వేడుకలను పురస్కరించుకుని నరసాపురం మండలంలోని కొప్పర్రు గ్రామంలో సుబ్రహ్మణ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అలాగే మొగల్తూరు మండలంలోని పేరుపాలెంనార్త్ రజకులపేటలో అన్నసమారాధన చేపట్టారు. భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

క్లుప్తంగా

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 40 రోజుల యజ్ఞంలో భాగంగా తోటవీధిలో గల దగ్గ నాగేశ్వరరావు ఇంటివద్ద ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమవరానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ మండ పార్వతి పాల్గొని జ్ఞాన బోధ చేసారు. ఈ కార్యక్రమంలో పార్వతి మాట్లాడుతూ శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయడం ద్వారా విశ్వశక్తిని పొందడం ద్వారా నాడిమండల శుద్ధి జరిగి శారీరక ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ కె.వి.డి.ప్రసాద్, నక్కెళ్ళ అప్పాజీ, ఉదయ్, వర్ విశ్వేశ్వరరావు, కె.మోహన్, బి.దేవి, యర్రాయమ్మ, వర్రె కృష్ణవేణి,భార్గవి,నక్కెళ్ళ సీతమ్మ, నక్కెళ్ళ లక్ష్మి, బి.రేణుక పాల్గొన్నారు.

ఆదాయం మున్సిపాలిటీకే చెందాలి

నరసాపురం: నరసాపురం వశిష్ఠ గోదావరి పంటురేవు ఆదాయం మున్సిపాలిటీకి చెందేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మాజీ అధికారి, సామాజిక కార్యకర్త కామన ధునుంజయ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి పంటు రేవు ప్రాంతం మున్సిపాలిటీ పరిధిలో ఉందన్నారు. పట్టణం నడిబొడ్డున పంటు రేవు ఉంటే, పంటు రేవు ద్వారా వచ్చే కోట్లాది రూపాలయ ఆదాయం మండల పరిషత్‌కు వెళ్లడం సరికాదన్నారు. రేవు వద్ద లైటింగ్ , పారిశుద్ధ్యం వంటి సదుపాయాలు కూడా మున్సిపాలిటీనే అందిస్తుందని చెప్పారు. ఎప్పుడో బ్రిటీష్ కాలం నుంచి ఈ ప్రాంతం మాధవాయిపాలెం పేరుతో రికార్డ్స్‌లో ఉండటాన్ని ఆసరాగా చేసుకుని ఆదాయం మున్సిపాలిటీకి చెందకుండా చేయడం పద్ధతి కాదన్నారు. ఈ అంశంపై ఎమ్మెల్యే, ఉన్నతాధికారులకు తాను ఫిర్యాదు చేశానని, గతంలో కూడా అనేక మంది పోరాడారని చెప్పారు. ఉన్నతాధికారులు కలుగజేసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు.

నేడు మేడపాడులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భీమవరం యూనిట్ కన్వీనర్స్ బుద్ధరాజు వెంకట పతిరాజు, ఆకెన కేశవరావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి నగరంలోని వేమగిరి ప్రాంతంలో ఉన్న పరమహంస యోగానంద నేత్రాలయ సంస్థ వైద్యులు ఈ శిబిరంలో పరీక్షలు చేస్తారన్నారు. పరీక్షలు అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వడమే కాకుండా ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తారని వారు వివరించారు. ఆంధ్రాబ్యాంకు శతజయంతోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. మేడపాడు పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కొప్పర్రు సొసైటీ మాజీ ప్రెసిడెంట్ తంబి మృతి

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు సహకార సంఘ మాజీ అధ్యక్షుడు పోలిశెట్టి విజయకుమార్ (తంబి) ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. హైదరాబాద్ వెళ్లి హెల్త్ చెకప్ చేయించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తున్న సమయంలో ట్రైన్‌లో గుండెపోటు రావడంతో అకాల మరణం చెందారు. మృతుడు తంబి గ్రామంలోని సహకార సంఘానికి కొంతకాలం అధ్యక్షుడిగానూ, మరికొంత కాలం పాలకవర్గ సభ్యుడిగా సేవలందించారు. మృతుడు తంబికి భార్య, కుమారు, కుమార్తె ఉన్నారు. తంబి మృతిపట్ల సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు బాబా, సభ్యులు చొప్పల సూర్యప్రకాష్ (జపాన్). పాకా రమాదేవి, మాజీ అధ్యక్షుడు పోలిశెట్టి మధు, రైతు సంఘం నాయకుడు చినమిల్లి వీరబాబు, అందే కవికుమార్ తదితరులు సంతాపం తెలిపారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: మండలంలోని అరట్లకట్ట గ్రామానికి చెందిన బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న తోటకూర పద్మని, అలాగే పోడూరు గ్రామానికి చెందిన రుద్రరాజు స్వరూప వర్మలకు హైదరాబాద్‌కు చెందిన పీఎల్‌రాజు కన్‌స్ట్రక్షన్స్ అధినేత వర్మ రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సహాయాన్ని పీఎల్‌రాజు బంధువు పెన్మెత్స బుద్ధరాజు, చెరుకూరి సత్యనారాయణరాజు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ ఆదివారం చెప్పారు. ప్రజలు తమ విజ్ఞప్తులు, ఫిర్యాదులను అందించాలని కోరారు.

ప్రోటోకాల్ పాటించాలి

పెనుగొండ: మాల మహానాడులో పదవి ఉన్న ప్రతీ ఒక్కరూ ప్రోటోకాల్ పాటించకపోతే క్రమ శిక్షణ చర్యలు ఉంటాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ హెచ్చరించారు. ఆదివారం ఆచంట వేమవరంలో జరిగిన మాల మహానాడు సమావేశంలో పాల్గొన్నారు.

నేడు సామాజిక పెన్షనర్ల జిల్లా సదస్సు

సాక్షి, భీమవరం: పట్టణంలో సోమవారం సామాజిక పెన్షనర్ల జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు వీరమ్మ చెరువు (బివి రాజు పార్క్) పార్క్ వద్ద అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని భీమారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు.

ఉల్లి ధరలు తగ్గించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలన్

ఉండి: పెరుగుతున్న ఉల్లి ధరలను తగ్గించి కిలో రూ.20లకే ప్రజలకు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఉండిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు ఉల్లిని అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారని అన్నారు. ఉల్లి అక్రమ నిల్వలపై దాడులు చేసి ధరను అదుపులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు మాదాసి గోపి, చీర్ల శేషు, కిలారి తవిటినాయుడు, నిమ్మితి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాంబు నిర్వీర్యంపై మాక్ డ్రిల్

సాక్షి, భీమవరం: పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు పర్యవేక్షణలో బాంబు నిర్వీర్యంపై మాక్ డ్రిల్‌ను భీమవరం బస్టాండ్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ప్రయాణికులను ఆ ప్రాంతానికి రానివ్వకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, బాంబును ఎలా గుర్తించాలో వివరించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: ఉండి శివారు ఉప్పుగుంట వద్ద ఆక్వా చెరువు గట్టుపై నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.16,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

నరసాపురం రూరల్: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచే కాకుండా తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు వచ్చారు. ప్రైవేటు వ్యక్తులు, దేవస్థానం వారు నిర్మించిన వంట షెడ్లన్నీ భక్తులతో నిండిపోయాయి. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ చైర్మన్, మేనేజర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపు పాలకొల్లులో అష్టావధానం

పాలకొల్లు అర్బన్: రసధుని, క్షత్రియ సంక్షేమ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9.30గంటలకు క్షత్రియ సంక్షేమ పరిషత్ భవనంలో 'అష్టావధానం' నిర్వహించనున్నట్లు రసధుని అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శతావధాని బలుసు అపర్ణ అవధాన ప్రక్రియను నిర్వహిస్తారన్నారు. సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్ సంచాలకులుగా వ్యవహరిస్తారన్నారు.

అమ్మవారి పూజా కుంకుమ అందజేత

పెనుగొండ: సిద్ధాంతం బస్టాండ్ సెంటర్‌లో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద పసుపు, కుంకుమ, గాజులకు మహిళలు పోటీేత్తారు. ఆదివారం సాయంత్రం ఆలయం వద్ద కమిటీ వారిచే మహిళలకు తొమ్మిది రోజుల పాటు అమ్మవారి పూజలలో వినియోగించిన పసుపు, కుంకుమ, గాజులు, రవిక పంపిణీ చేశారు. వేలాది మంది మహిళలు వీటిని అందుకోవడానికి పోటీ పడ్డారు. ఈ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 5 వేల మందికి పైగా అన్న ప్రసాదం స్వీకరించారు.